TG/TEL/25/A3731

నిజం

దృష్టి తెలుగు న్యూస్

WANTED

రిపోర్టర్లు కావలెను

నిజం దృష్టి తెలుగు న్యూస్

దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాదాన్యత ఇవ్వబడును.

సెల్: 9247842354

హైదరాబాద్ ఎడిటర్: వరుదు సుజాత సంపుటి:-1 సంచిక:-246 పేజీలు:-4 బుధవారం 19-08-2026

SIMULTANEOUSLY PRINTED AT ADHILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR | KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

బీసీల జనాభా లెక్కలు తేల్చి సామాజిక న్యాయం కల్పించాం



1 అమరవీరుల స్తూపానికి ప్రాధాన్యతే పాపన్న గౌడ్ విగ్రహానికి ఉండాలి

1 తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

1 సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం

1 ట్యాంక్‌బండ్ వద్ద సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు

1 బీఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించిన సీఎం

తెలంగాణ చరిత్రలోనే బీసీల జనాభా లెక్కలు తేల్చి సామాజిక న్యాయం అందించిన తొలి ప్రభుత్వం తమదేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. అర్హులైన నేత, గీత కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ప్రజాపాలనను కాపాడుకోవాలని, మళ్లీ పాత దొరల గద్దెనెక్కేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని పిలుపునిచ్చారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయ్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని మంత్రులు, గౌడ సంఘాల నేతల సమక్షంలో సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గౌడ, యాదవ, ముదిరాజ్, దళిత వర్గాలను ప్రోత్సహించేలా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఏ ఒక్క కులానికో, మతానికో పరిమితం కాలేదని, బహుజనులను ఏకతాటిపైకి తెచ్చి గోల్కొండ కోటపై జెండా ఎగురవేశారని రేవంత్ రెడ్డి తెలిపారు. కులవృత్తులను గౌరవిస్తూనే పిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ చదివించాలని తల్లిదండ్రులను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కుటుంబ న్యాయం మాత్రమే - మిగతా 2 లో

మేము అధికారంలోకి వస్తే ప్రతి పేద కుటుంబానికి ఒక ఎకరం భూమి ఇస్తాం

8 తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

8 భూ లక్ష్మి పథకం కింద పేదలకు ఎకరం చొప్పున ఇస్తామన్న కవిత

8 రేవంత్ రెడ్డికి భూమి అంటే కేవలం వ్యాపార లావాదేవీలేనని విమర్శ

8 రాష్ట్రంలో రేవంత్, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల దోపిడీ సాగుతోందని ఆరోపణ

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ప్రకటన చేశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే 'భూ లక్ష్మి పథకం' కింద భూమి - మిగతా 2 లో

ఈసీ లక్షలాది ఓట్లను తొలగించింది

8 మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపణ

8 ఓటర్ల జాబితా నుంచి భారీగా ఓట్లు తొలగించారని ఆరోపణ

8 సుమారు 73 లక్షల ఓట్లు తొలగించారన్న మహేశ్ కుమార్ గౌడ్

8 బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదని విమర్శ

5జీతో వేగం.. 6జీ పైనా భారత్ దృష్టి



8 2030 నాటికి భారత్‌లో 62 శాతానికి చేరనున్న 5జీ వినియోగం

8 ఆసియా పసిఫిక్ సగటును అధిగమించనున్న ఇండియా

8 కవరేజీ కంటే వినియోగం పెంచడమే అసలు సవాల్ అని వెల్లడి

8 భారత్ డిజిటల్ ప్రగతిపై జీఎస్ఎంఏ నివేదికలో ప్రశంసలు

5జీ టెక్నాలజీ వినియోగంలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా నిలవనుందని, 2030 నాటికి దేశంలో 5జీ స్వీకరణ 62 శాతానికి చేరుకుంటుందని 'గ్లోబల్ మొబైల్ కమ్యూనికేషన్స్ సిస్టమ్'(జీఎస్ఎంఏ) తన తాజా నివేదికలో వెల్లడించింది. ఇది ఆసియా పసిఫిక్ ప్రాంత సగటు 50 శాతం కంటే గణనీయంగా ఎక్కువ కావడం విశేషం. ఈ ప్రాంతంలో బంగ్లాదేశ్, ఇండోనేషియా, పాకిస్థాన్‌లతో పాటు భారత్‌ను కూడా 'ప్రముఖ దేశం'గా జీఎస్ఎంఏ గుర్తించింది. ఒకప్పుడు నెట్‌వర్క్ కవరేజీ పెద్ద సవాల్‌గా ఉండగా, ఇప్పుడు దేశంలో ఆ సమస్య దాదాపు పరిష్కారమైందని - మిగతా 2 లో

పసిబిడ్డతో అసెంబ్లీకి విజయ్ పార్టీ ఎమ్మెల్యే

8 సోషల్ మీడియాలో చర్చ

8 తమిళనాడు అసెంబ్లీకి పసిబిడ్డతో టీవీకే ఎమ్మెల్యే పల్లవి

8 సోషల్ మీడియాలో మిశ్రమ స్పందన.. కొందరు మద్దతు, కొందరు విమర్శ

8 బిడ్డను ఇంట్లో వదిలిరాలేనని స్పష్టం చేసిన ఎమ్మెల్యే

8 ఇబ్బందులు తెలియకుండా ట్రోల్ చేయడం సరికాదన్న పల్లవి

తమిళనాడు అసెంబ్లీ సమావేశాలకు ఓ మహిళా ఎమ్మెల్యే తన పసిబిడ్డతో హాజరవడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి చెందిన ఎమ్మెల్యే ఆర్. పల్లవి, కొన్ని - మిగతా 2 లో

అర్జున అవార్డు గ్రహీతలకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు

8 అర్జున అవార్డులకు ఎంపికైన తెలంగాణ క్రీడాకారులకు ముఖ్యమంత్రి అభినందనలు

8 షట్లర్ గాయత్రి, షూటర్ ధనుష్‌లను ప్రశంసించిన రేవంత్ రెడ్డి

8 వీరిద్దరూ తెలంగాణకు, దేశానికి గర్వకారణమని వ్యాఖ్య

వెలుగులోకి అరుదైన జీవి

8 'గంగైఇక్తిస్ ఇండోనేపాలికస్'గా నామకరణం

8 భారత్-నేపాల్ సరిహద్దు ప్రాంతంలో ఓ బోరుబావి నుంచి బయటపడ్డ జీవి

8 గంగానది పేరుతో దీనికి 'గంగైఇక్తిస్' అనే పేరు

8 'చౌధురిదే' కుటుంబానికి చెందిన కొత్త జాతిగా గుర్తింపు

సోషల్ మీడియాలో వైరల్ అయిన ఓ వీడియో శాస్త్రవేత్తలను ఓ అరుదైన చేప జాతి ఆచూకీ - మిగతా 2 లో

'ఆపరేషన్ సిందూర్'పై డిస్కవరీ చానల్ డాక్యుమెంటరీ

8 ఉలిక్కిపడిన పాకిస్థాన్!

8 'ఆపరేషన్ సిందూర్'పై డిస్కవరీ డాక్యుమెంటరీతో కలకలం

8 భారత్ వాదనలను తప్పుబడుతూ పాక్ సైన్యం అధికారిక ప్రకటన

8 ఉగ్రసంస్థలకు భారీ నష్టం జరగడంతో పాక్ ఎదురుదాడి

భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై డిస్కవరీ ఛానెల్ రూపొందించిన డాక్యుమెంటరీ ప్రస్తుతం పాకిస్థాన్‌లో తీవ్ర ప్రకంపనలు - మిగతా 2 లో

గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా వర్ల రామయ్య, దళవాయి రమ

8 అభ్యర్థుల ఎంపికకు ఆమోదం తెలిపిన ఏపీ కేబినెట్

8 ఆమోదం కోసం గవర్నర్ వద్దకు చేరిన దస్త్రం

8 సీనియారిటీకి, పార్టీ సేవకు గుర్తింపునిచ్చిన టీడీపీ అధిష్ఠానం

8 గత ఎమ్మెల్సీల పదవీకాలం ముగియడంతో ఏర్పడిన ఖాళీలు

ఆంధ్రప్రదేశ్‌లో గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ స్థానాలకు రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థులను ఖరారు చేసింది. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సీనియర్ నేత వర్ల రామయ్య, అనంతపురం జిల్లాకు చెందిన బీసీ మహిళా నేత దళవాయి రమాదేవిలను శాసనమండలికి నామినేట్ చేయాలని ఏపీ కేబినెట్ నిర్ణయించింది. - మిగతా 2 లో

స్థానిక ఎన్నికల్లో కూటమితో కలిసి బరిలోకి దిగుతాం

8 బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

8 స్థానిక ఎన్నికల కోసం మంత్రి సత్యకుమార్ నేతృత్వంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశామన్న మాధవ్

8 ప్రతి గ్రామంలో కమలం జెండా ఎగిరేలా ముందుకు వెళ్లాలని శ్రేణులకు పిలుపు

8 విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకున్నామని వ్యాఖ్య

ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే కూటమి భాగస్వాములతో కలిసే బరిలోకి దిగుతామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు. విశాఖపట్నంలో జరిగిన పార్టీ నాయకులు, కార్యకర్తల కీలక - మిగతా 2 లో

అక్టోబర్‌లోగా స్థానిక సంస్థల ఎన్నికలు

1 బీసీ రిజర్వేషన్ల అమలుకు కేబినెట్ ఆమోదం

1 సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం

1 స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలే ప్రధాన అజెండాగా భేటీ

1 పరిశ్రమలు, ఐటీ, ఇంధనం, పర్యాటక రంగాలపై చర్చ

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.1 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించింది. కేంద్ర ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన సుమారు రూ.16,500 కోట్ల నిధులు మురిగిపోకుండా అక్టోబర్‌లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఏపీ పంచాయతీరాజ్ చట్టం-1994 నిబంధనల ప్రకారం బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. న్యాయపరమైన అంశాల్లో ఉన్న 23 మునిసిపాలిటీల విలీనాన్ని తర్వాత పరిశీలిద్దామని, ముందుగా అన్ని స్థానిక సంస్థల్లో ఎన్నికలు నిర్వహిద్దామని స్పష్టం చేశారు. మేయర్ ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలని, పాత విధానంలో ఒక్క డిప్యూటీ మేయర్ పదవికే పరిమితం - మిగతా 2 లో

సంపాదకీయం

అర్థమవుతోందా ట్రంప్.. ఒడిస్సీ సందేశం!

ఎప్పుడూ కయ్యానికి కాలుదువ్వే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇటీవల ఓ చల్లటి కబురు చెప్పారు. ఇరాన్‌తో యుద్ధం త్వరలో ముగిసిపోతుందన్నదే ఆ చక్కటి మాట! అంతర్జాతీయ సమాజం కోరుకుంటున్నదే అది కదా! ఆ యుద్ధ పరిసమాప్తినే సమస్త దేశాలూ ఆకాంక్షిస్తున్నాయి. ప్రపంచ ప్రజలూ అందుకోసమే ప్రతీక్షిస్తున్నారు. కళారూపాలు ఆ ఆరాటాన్నే వ్యక్తం చేస్తున్నాయి, ప్రతిబింబిస్తున్నాయి. ఇదిగో, ఈ మధ్యే విడుదలై ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోన్న హాలీవుడ్ చిత్రం 'ఒడిస్సీ' కూడా మానవాళి అభిమతాన్ని చెప్పకనే చెప్పింది: యుద్ధం వద్దు, శాంతి ముఖ్యం. ఇంతకుముందు 'ఇంటర్ స్టెల్లార్', 'ఓపెన్ హైమర్' వంటి సినిమాలతో చలనచిత్ర జగత్తులో తనకంటూ ఒక విశిష్ట స్థానాన్ని సృష్టించుకున్న క్రిస్టోఫర్ నోలన్ ఈ 'ఒడిస్సీ' దర్శకుడు. మౌఖిక సంప్రదాయంలో ప్రజల నోళ్లలో నానుతున్న ఒక గ్రీక్ పుక్కిటపురాణాన్ని తన 'ఒడిస్సీ'కి కథగా నోలన్ ఎంచుకున్నాడు. అసలు నిజంగా ఉన్నాడో లేడో తెలియని ప్రాచీన గ్రీక్ వాగ్గేయకారుడు హోమర్ మూడువేల సంవత్సరాల క్రితం రాసినట్టు చెబుతున్న 'ఒడిస్సీ' అనే కావ్యం ఈ నాటి అత్యాధునిక డిజిటల్ ప్రపంచంలో ఐమాక్స్ ఫార్మాట్‌లో చలనచిత్రంగా ప్రపంచవ్యాప్తంగా సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇదొక కళాత్మక విచిత్రం. సౌందర్యాత్మక విచిత్రమది. నోలన్ 'ఒడిస్సీ'లో ఉగ్రూతలూగించే దృశ్యాలు లేవు. భయంకరమైన యుద్ధాలు లేవు. సినిమా విజయానికి సాధారణంగా కావలసిన పటాటోపం కూడా ఏమీ లేదు! అయినప్పటికీ, లేదా అందువల్లే ఈ 'ఒడిస్సీ'కి ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. ఇందుకు ఒక కారణం అంతకుముందు తెలిసినా తెలియకపోయినా స్వభావరీత్యా కథ సార్వజనీనం కావడమే. ఆ కథ ప్రతి దేశ చరిత్రతోనూ ఎంతో కొంత ప్రాసంగికత కలిగి ఉండడం మరో కారణం. మరీ ముఖ్యంగా ఈ చిత్ర కథనంతో ప్రేక్షకులు ఏదో ఒక దశలో తమను తాము గుర్తించగలగడం! జీవితంలో చాలా సాధించేశాం అనుకున్న తర్వాత ఇంకా ఏముంది సాధించడానికి అన్న మీమాంస మొదలవుతుంది, లేదా జీవన పోరాటంలో మన చుట్టూ ఉన్న మనవాళ్లు చివరివరకూ ఉంటారని ఆశిస్తే వారంతా పరిస్థితుల ప్రాబల్యం వల్ల ఆకస్మికంగా మనకు దూరం కావచ్చు. విజయ తీరాలు దాటేసిన తర్వాత ఒంటరిగా మిగిలిపోవచ్చు, ఎటుపోవడానికీ పాలుపోని సమయంలో అనూహ్యంగా ఎవరో వచ్చి కాసింత బాసటగా నిలవచ్చు. జీవితంలో ఏదో సాధించడానికి ఎక్కడెక్కడికో ఒంటరి ప్రయాణం చేస్తుంటే ఇంటివాళ్ల పరిస్థితి జ్ఞప్తికి వచ్చి మానసికంగా అశాంతికి గురి కావచ్చు; తీరా ఇంటికి వచ్చాక మనవాళ్లకు మనమే సుదూరతీరాల నుంచి వచ్చిన అపరిచితుల్లా కనిపించవచ్చు... ఈ దశలన్నిటినీ 'ఒడిస్సీ' చిత్రంలోని కథానాయకుడు ఒడిస్సియస్ అనుభవిస్తాడు. ఇటువంటి అనుభవాలు ఆధునిక జీవితంలో సైతం మనకూ ఎదురుకావచ్చు. అటువంటి స్థితిలోనే ప్రేక్షకులు ఒడిస్సియస్‌లో తమను తాము చూసుకుంటారు. ఆ పాత్రతో తాదాత్మ్యం చెందుతారు.

అక్టోబర్‌లోగా స్థానిక సంస్థల ఎన్నికలు

మొదటిపేజీ తరువాయి - కావాలని నిర్ణయం తీసుకుంది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో ఎలాంటి మార్పు ఉండదని, ప్రస్తుతం అమల్లో ఉన్న రిజర్వేషన్లే కొనసాగుతాయని స్పష్టం చేసింది. బీసీ రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిషన్ ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు కేబినెట్‌కు వివరించారు. ప్రస్తుతం ఉన్న 13 జెడ్పీలను జిల్లాల పునర్విభజనకు అనుగుణంగా 28 జిల్లా పరిషత్‌లుగా ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. మొత్తం 57 అజెండా అంశాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఉద్యోగాల కల్పన, పరిశ్రమలు, ఐటీ, ఇంధనం, పర్యాటక రంగాలకు సంబంధించిన కీలక ప్రతిపాదనలపై నిర్ణయాలు తీసుకున్నారు. 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్‌పై కీలక నిర్ణయం తీసుకున్నారు. బీసీ విద్యార్థులకు కోచింగ్ సెంటర్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటు బిల్లు, ఉన్నత విద్యలో ఫీజుల నిర్ణయానికి కొత్త కమిషన్ బిల్లుపై చర్చించింది. మంత్రివర్గ అజెండా అంశాలపై చర్చ పూర్తయిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ పరిణామాలపై మంత్రులు, అధికారులతో చర్చించారు. ద్రవ్యోల్బణం పెరుగుతున్న నేపథ్యంలో ధరల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సోషల్ మీడియాలో వస్తున్న నెగిటివ్ కామెంట్లపై ధీటుగా స్పందించాలని సూచించారు. మద్యం బ్రాండ్లకు పిచ్చిపిచ్చి పేర్లు పెట్టకుండా కమిటీ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అక్రమంగా కంటైనర్లలో ఇసుక తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

స్థానిక ఎన్నికల్లో కూటమి పార్టీలతో కలిసి బరిలోకి దిగుతాం

మొదటిపేజీ తరువాయి - సమావేశంలో మాట్లాడిన ఆయన, స్థానిక ఎన్నికల సమన్వయ బాధ్యతలను పర్యవేక్షించేందుకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నేతృత్వంలో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కూటమి ధర్మాన్ని పాటిస్తూనే వార్డు స్థాయి నుంచి ప్రతి గ్రామంలోనూ కమలం జెండా ఎగిరేలా, స్థానిక పదవులను దక్కించుకునేలా ప్రణాళికలతో ముందుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ నాయకత్వంలో చేపడుతున్న అభివృద్ధి ఫలాలను, మన్ కీ బాత్ వేదికగా వ్యక్తమయ్యే సందేశాలను ప్రతి ఇంటా ప్రచారం చేయాలని సూచించారు. అలాగే విశాఖ అభివృద్ధి గురించి ప్రస్తావిస్తూ... దక్షిణ కోస్తా రైల్వే జోన్ సాధనతో పాటు విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకున్నామని, ప్రస్తుతం అది లాభాల దిశగా ప్రయాణిస్తోందని పేర్కొన్నారు. పోలవరం నీటిని విశాఖ ప్రాంతానికి అందించే పనులు కూడా వేగవంతమయ్యాయని వివరించారు.

పసిబిడ్డతో అసెంబ్లీకి విజయ్ పార్టీ ఎమ్మెల్యే

మొదటిపేజీ తరువాయి - నెలల వయసున్న తన బిడ్డను ఎత్తుకుని సభా కార్యక్రమాలకు హాజరవుతున్నారు. ఈ ఉదంతంపై సామాజిక మాధ్యమాల్లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో పల్లవి తన బిడ్డను సహాయకురాలి పర్యవేక్షణలో ఉంచి, విరామ సమయాల్లో పసికందు బాగోగులు చూసుకుంటున్నారు. అయితే, ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు పసిబిడ్డను తీసుకువచ్చి అసౌకర్యం కలిగిస్తున్నారంటూ కొందరు ఆమెపై విమర్శలు గుప్పిస్తున్నారు. మరోవైపు, ఒక తల్లిగా పసిబిడ్డను సంరక్షించుకుంటూనే, ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తున్నారంటూ పలువురు ఆమెకు మద్దతు తెలుపుతున్నారు. ఈ విమర్శలపై ఎమ్మెల్యే పల్లవి స్పందించారు. "బిడ్డకు కొన్ని నెలలే వయసే కావడంతో ఇంట్లో వదిలి రావడం సాధ్యం కాదు. ఒక తల్లిగా నా బాధ్యతలను, ఎమ్మెల్యేగా నా విధులను ఏకకాలంలో నిర్వర్తించడంలో ఎలాంటి తప్పు లేదు. నేను కేవలం నా కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నాను తప్ప, ఎవరికీ ఇబ్బంది కలిగించాలనే ఉద్దేశం నాకు లేదు. వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోకుండా సామాజిక మాధ్యమాల్లో ట్రోల్ చేయడం సరికాదు" అని ఆమె స్పష్టం చేశారు.

అర్జున అవార్డు గ్రహీతలకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు

మొదటిపేజీ తరువాయి - ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డులకు ఎంపికైన తెలంగాణ క్రీడాకారులు, షట్లర్ పుల్లెల గాయత్రి గోపీచంద్, షూటర్ ధనుష్ శ్రీకాంత్‌లకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. క్రీడా రంగంలో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన వీరిద్దరూ తెలంగాణతో పాటు దేశానికే గర్వకారణమని ఆయన కొనియాడారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. "క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభతో అర్జున అవార్డులకు ఎంపికైన గాయత్రి, ధనుష్ తెలంగాణకు గర్వకారణం" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వీరితో పాటు 2025 సంవత్సరానికి గాను జాతీయ క్రీడా పురస్కారాలు గెలుచుకున్న విజేతలందరికీ ఆయన తన శుభాకాంక్షలు తెలియజేశారు. క్రీడా రంగంలో వారు చూపిన పట్టుదల, నిబద్ధత, కఠోర శ్రమ యువ క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తిదాయకమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. భవిష్యత్తులో వారు మరిన్ని విజయాలు సాధించి, మరెన్నో ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకోవాలని ఆయన మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

వెలుగులోకి అరుదైన జీవి

మొదటిపేజీ తరువాయి - వైపు నడిపించింది. సాధారణంగా చేపలకు ఉండే లక్షణాలకు పూర్తిగా భిన్నంగా, అచ్చం వానపాములా కనిపించిన ఓ చిన్న జీవి భారత్-నేపాల్ సరిహద్దు ప్రాంతంలో ఓ బోరుబావి నుంచి బయటకు వచ్చింది. 2024లో సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్ కావడంతో శాస్త్రవేత్తల దృష్టి దానిపై పడింది. పూర్తిగా చీకటిగా ఉండే భూగర్భ జలాల్లో ఈ జీవి బయటపడటంతో ఇది ఇంతవరకు గుర్తించని కొత్త జాతి కావచ్చని పరిశోధకులు అనుమానించారు. ఈ వింత చేపకు శాస్త్రవేత్తలు 'గంగైఇక్తిస్ ఇండోనేపాలికస్' అనే పేరు పెట్టారు. గంగానది పేరుతో దీనికి 'గంగైఇక్తిస్' అనే పేరు పెట్టినట్లు పరిశోధకులు తెలిపారు. దాదాపు నాలుగు సెంటీమీటర్ల పొడవు ఉండే ఈ చేపకు కళ్లు చాలా చిన్నగా ఉంటాయి. భూగర్భంలో ఎలాంటి వెలుతురు లేకపోవడంతో చూపు అవసరం లేకపోవడమే ఇందుకు కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ చేపకు పెద్ద రెక్కలు లేవు. నీటితో నిండిన మట్టి పొరలు, భూగర్భంలోని తడి ప్రాంతాల్లో వానపాములా శరీరాన్ని మెలితిప్పుకుంటూ కదులుతుంది. బయటకు చూస్తే వానపాములా కనిపించినప్పటికీ, మైక్రో-సీటీ స్కానింగ్, జన్యు విశ్లేషణల ద్వారా ఇది పూర్తిగా భిన్నమైన చేప జాతి అని పరిశోధకులు నిర్ధారించారు. ఇది 'చౌధురిడే' కుటుంబానికి చెందిన కొత్త జాతిగా గుర్తించారు. ఈ అరుదైన చేపను పట్టుకోవడం మాత్రం పరిశోధకులు చాలా శ్రమించారు. బోరుబావులను గుర్తించి వాటి యజమానుల అనుమతి తీసుకొని పరిశోధకులు నీటిని చేతులతో బయటకు తోడారు. సుమారు 2,000 లీటర్ల నీటిని బయటకు తీసిన తర్వాత మొదటి చేప కనిపించింది. అయితే అది గాయపడి వెంటనే చనిపోయింది. మరో 500 లీటర్ల నీటిని తోడిన తర్వాత రెండో చేప లభించింది. అదే పూర్తి స్థితిలో లభించిన నమూనా కావడంతో దానిని ఈ కొత్త జాతికి 'హోలోటైప్'గా శాస్త్రవేత్తలు గుర్తించారు. ముంబైకి చెందిన ఠాక్రే వైల్డ్‌లైఫ్ ఫౌండేషన్, కొల్హాపూర్‌లోని శివాజీ యూనివర్సిటీ, చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌కు చెందిన షాంఘై సింక్రోట్రాన్ రేడియేషన్ ఫెసిలిటీ, జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన పరిశోధకులు కలిసి ఈ అధ్యయనం నిర్వహించారు. ఈ పరిశోధన వివరాలు 'జూకీస్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఇండో-గంగా మైదానాల్లో, గంగానది పరివాహక ప్రాంతంలో గుర్తించిన తొలి భూగర్భ జల చేపగా దీన్ని పరిశోధకులు పేర్కొన్నారు. సోషల్ మీడియాలో సాధారణంగా కనిపించిన ఓ వీడియో చివరకు శాస్త్రవేత్తలను భూమి లోపల దాగి ఉన్న అరుదైన జీవ వైవిధ్యాన్ని కనుగొనేలా చేసింది. కోట్లాది మంది జీవనానికి నీరు, ఆహారం, ఉపాధిని అందించే గంగానది పరివాహక ప్రాంతంలో ఇలాంటి వింత జీవి బయటపడటం శాస్త్రవేత్తలకు ఆసక్తికరమైన పరిణామంగా మారింది. సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చిన ఈ ఆవిష్కరణ ఇప్పుడు ప్రపంచ శాస్త్రీయ వర్గాల దృష్టిని ఆకర్షిస్తోంది.

5జీతో వేగం.. 6జీ పైనా భారత్ దృష్టి

మొదటిపేజీ తరువాయి - నివేదిక పేర్కొంది. ప్రస్తుతం కవరేజీ గ్యాప్ 5 శాతానికి పడిపోవడంతో అసలు సవాల్ కవరేజీ నుంచి వినియోగం, స్వీకరణ వైపు మారిందని తెలిపింది. స్మార్ట్‌ఫోన్ల ధరలు, డిజిటల్ నైపుణ్యాల కొరత, ఆన్‌లైన్ భద్రతపై నమ్మకం వంటివి మొబైల్ ఇంటర్నెట్ వాడకానికి ప్రధాన అవరోధాలుగా ఉన్నాయని వివరించింది. ఈ సవాళ్లను అధిగమించేందుకు భారత్ చేస్తున్న ప్రయత్నాలను నివేదిక ప్రశంసించింది. 'భారత్‌నెట్', 'ప్రధానమంత్రి గ్రామీణ డిజిటల్ సాక్షరత అభియాన్ (పీఎంజీదిశ)' వంటి పథకాలను ఉదాహరణగా పేర్కొంది. పీఎంజీదిశ ద్వారా ఇప్పటికే 6.4 కోట్ల మంది గ్రామీణ పౌరులకు డిజిటల్ నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చినట్లు గుర్తు చేసింది. అదే సమయంలో డిజిటల్ నమ్మకాన్ని పెంపొందించడం కూడా భారత్‌కు ఆర్థిక ప్రాధాన్యతగా మారుతోందని, 2026 నాటికి ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీపై చేసే ఖర్చు 11.7 శాతం పెరుగుతుందని అంచనా వేసింది. ఇందుకు దేశంలో అమలవుతున్న డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం దోహదపడుతోందని తెలిపింది. టెక్నాలజీలో స్వావలంబనపై భారత్ దృష్టి సారించిందని, 'ఆత్మనిర్భర్ భారత్' విధానం ఇందుకు నిదర్శనమని నివేదిక పేర్కొంది. బీఎస్ఎన్ఎల్ దేశీయంగా అభివృద్ధి చేసిన 4జీ టెక్నాలజీని వాడటం, దానిని 5జీకి అప్‌గ్రేడ్ చేసుకునే వీలుండటం గొప్ప విషయమని తెలిపింది. అంతేకాకుండా భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని భారత్ ఇప్పటికే 6జీ స్పెక్ట్రమ్ రోడ్‌మ్యాప్‌ను కూడా ప్రకటించడం దాని దీర్ఘకాలిక ప్రణాళికకు అద్దం పడుతోందని వివరించింది. 5జీ, కృత్రిమ మేధ (ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటివి తయారీ, సేవల రంగాల్లో ఉత్పాదకతను గణనీయంగా పెంచుతాయని నివేదిక అంచనా వేసింది.

'ఆపరేషన్ సిందూర్'పై డిస్కవరీ చానల్ డాక్యుమెంటరీ

మొదటిపేజీ తరువాయి - సృష్టిస్తోంది. ఆగస్టు 15న ప్రసారమైన "డీక్లాసిఫైడ్: ఆపరేషన్ సిందూర్" అనే ఈ డాక్యుమెంటరీతో ఉలిక్కిపడిన పాకిస్థాన్, ఈ డాక్యుమెంటరీపై, భారత్‌పై ఎదురుదాడికి దిగింది. పహల్గామ్ దాడికి ప్రతీకారంగా భారత సాయుధ దళాలు అత్యంత రహస్యంగా నిర్వహించిన ఈ ఆపరేషన్ వివరాలను ఈ డాక్యుమెంటరీ కళ్లకు కట్టింది. పాకిస్థాన్ సైన్యానికి చెందిన మీడియా విభాగం 'ఇంటర్-సర్వీస్ పబ్లిక్ రిలేషన్స్' (ఐఎస్‌పీఆర్) ఈ డాక్యుమెంటరీపై స్పందిస్తూ, ఇది భారత్ సృష్టించిన కల్పిత కథనమని ఆరోపించింది. ఈ ఆపరేషన్ వంద శాతం విజయవంతమైందన్న భారత వాదనలను అది తోసిపుచ్చింది. అయితే, ఆపరేషన్ సిందూర్ అనంతరం పాక్ సైన్యం తీవ్రంగా నష్టపోయిందని, ఆ పరాభవాన్ని కప్పిపుచ్చుకోవడానికే పాక్ ఉన్నతాధికారులు ఇటువంటి దూకుడు ప్రదర్శిస్తున్నారని భారత అధికారులు విశ్లేషిస్తున్నారు. ఈ ఆపరేషన్ ధాటికి లష్కరే తోయిబా, జైషే మహ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి ఉగ్రవాద సంస్థలు తమ శిక్షణా కేంద్రాలు, ప్రధాన కార్యాలయాలతో పాటు కీలక మౌలిక వసతులను, కేడర్‌ను భారీగా కోల్పోయాయి. తాజాగా విడుదలైన ఈ డాక్యుమెంటరీ పాకిస్థాన్ పాత గాయాలపై కారం చల్లినట్లయిందని రక్షణ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో, డాక్యుమెంటరీ ప్రామాణికతను ప్రశ్నిస్తూ సోషల్ మీడియా వేదికగా నిరంతర ప్రచార దాడులు నిర్వహించాలని ఐఎస్‌పీఆర్‌కు ఆదేశాలు అందినట్లు భారత నిఘా వర్గాలు భావిస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్ జరిగినప్పటి నుంచి భారత్‌పై పాకిస్థాన్ ఒక 'సమాచార యుద్ధాన్ని కొనసాగిస్తోందని, అందులో భాగంగానే సోషల్ మీడియా హ్యాండిల్స్ ద్వారా తప్పుడు కథనాలు, మార్ఫింగ్ వీడియోలను ప్రచారం చేసే ప్రమాదముందని నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

బీసీల జనాభా లెక్కలు తేల్చి సామాజిక న్యాయం కల్పించాం

మొదటిపేజీ తరువాయి - జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాజిక న్యాయం చేస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. నేత, గీత కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని సీఎం తెలిపారు. బీసీల జనాభా లెక్కలు తేల్చి సామాజిక న్యాయం అందించిన తొలి ప్రభుత్వం తమదేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతిపక్షంలో ఉన్న కేటీఆర్, హరీశ్‌రావు ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. రాష్ట్రంలో కరవు రావాలని కోరుకుంటూ అఘోరాలతో చేతబడులు చేయించారని ఆరోపించారు. పాత దొరల పాలన మళ్లీ రావడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని ప్రజలను కోరారు. గత బీఆర్ఎస్ పాలనపై సీఎం రేవంత్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'నాడు గొర్రెలు, బర్రెలు, చేపలు పంపిణీ చేసి.. రాజ్యం వాళ్లు ఏలుతూ, మనల్ని కుల వృత్తులకే పరిమితం చేయాలని చూశారు' అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ సీఎం అయితే ఆయన కొడుకు కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్, అల్లుడు హరీశ్ రావు మంత్రి అయ్యారని.. అదే రేవంత్ సీఎం అయితే బీసీ నేత మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్, సీతక్క, వాకిటి శ్రీహరి మంత్రులయ్యారని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనుమరాలికి కీలక పదవులు ఇచ్చి ఉద్యమకారులను గౌరవించామని తెలిపారు. రాబోయే డీలిమిటేషన్ తర్వాత 117 సీట్లతో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

ఈసీ లక్షలాది ఓట్లను తొలగించింది

మొదటిపేజీ తరువాయి - తెలంగాణలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం (ఈసీ) విచక్షణారహితంగా లక్షలాది ఓట్లను తొలగించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ముసాయిదా ఓటరు జాబితా విడుదలైన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించలేదని, ఈ ఓట్ల తొలగింపు ప్రక్రియ వల్ల పేదలు, వలస కార్మికులే ఎక్కువగా నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2002 నాటి ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకోవడం ఆచరణ సాధ్యం కాదని, పాత రికార్డులను సాకుగా చూపుతూ పౌరుల ఓటు హక్కును నిరాకరించడం సరైన పద్ధతి కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఎలాంటి పక్కా కారణాలు లేకుండా సుమారు 73 లక్షల ఓట్లను తొలగించారని, మరో 92 లక్షల ఓట్లను అనుమానిత జాబితాలో చేర్చారని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. నియోజకవర్గాల పునర్విభజన, పోలింగ్ కేంద్రాల మార్పుల వల్ల తలెత్తిన సాంకేతిక సమస్యలు ఈ గందరగోళానికి కారణమయ్యాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీల తరహాలోనే ఎన్నికల సంఘాన్ని కూడా తన 'పాకెట్ సంస్థ'గా మార్చుకుందని ఆయన తీవ్రంగా విమర్శించారు.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా వర్ల రామయ్య, దళవాయి రమ

మొదటిపేజీ తరువాయి - ఈ మేరకు సిఫార్సులతో కూడిన దస్త్రాన్ని ఆమోదం కోసం రాజ్ భవన్‌కు పంపింది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఉన్న పండుల రవీంద్రబాబు, జాకియా ఖానమ్‌ల పదవీకాలం ముగియడంతో ఈ రెండు స్థానాలు ఖాళీ అయ్యాయి. ఈ నేపథ్యంలో అధికార టీడీపీ, పార్టీకి సుదీర్ఘ కాలంగా సేవలందిస్తున్న ఇద్దరు నేతలకు అవకాశం కల్పించింది. దళిత వర్గానికి చెందిన వర్ల రామయ్య పార్టీలో కీలక నేతగా, గతంలో ఆర్టీసీ ఛైర్మన్‌గా పనిచేశారు. పార్టీ వాయిస్‌ను బలంగా వినిపించడంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. 2009లో తిరుపతి లోక్‌సభ స్థానం నుంచి ఆయన పోటీ చేశారు. మరోవైపు, అనంతపురం జిల్లాకు చెందిన దళవాయి రమాదేవి బీసీ (వడ్డెర) సామాజిక వర్గానికి చెందిన నాయకురాలు. రెండు దశాబ్దాలుగా ఆమె పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం అనంతపురం పార్లమెంట్ అంగన్‌వాడీ సంఘం అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారు. ఆమె కుటుంబం మొదటి నుంచి టీడీపీకి అండగా నిలుస్తోంది. 2021లో అనంతపురం కార్పొరేటర్‌గా పోటీ చేసిన రమాదేవి, 2024 సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి విశేషంగా కృషి చేశారు. సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకొని, పార్టీకి విధేయంగా ఉన్న సీనియర్ నేతకు, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న మహిళా నేతకు పదవులు ఇవ్వడం ద్వారా టీడీపీ అధిష్ఠానం స్పష్టమైన సందేశం పంపినట్టయింది. ప్రస్తుతం ఈ ఫైల్ గవర్నర్ పరిశీలనలో ఉండగా, ఆయన ఆమోదముద్ర వేయగానే వీరి నియామకం అధికారికంగా ఖరారు కానుంది.

మేము అధికారంలోకి వస్తే ప్రతి పేద కుటుంబానికి ఒక ఎకరం భూమి ఇస్తాం

మొదటిపేజీ తరువాయి - లేని పేదలకు ఎకరం చొప్పున ఇస్తామని ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భూమి అంటే కేవలం వ్యాపార లావాదేవీలే కావచ్చు కానీ, పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు భూమి, అడవి అంటే పంచప్రాణాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు చేపట్టినా ముందుగా పేదల అసైన్డ్ భూములనే లాక్కుంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సోదరులు, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల దోపిడీ, రాక్షస పాలన సాగుతోందని ఆరోపించారు. ప్రభుత్వం దాదాపు 30 వేల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కుందని, ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పినట్లుగా పేదల అసైన్డ్ భూములపై వారికే పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి 'మేకవన్నె పులి' లాంటి వారని... ఆయన చెప్పేది సామాజిక న్యాయం అయితే, చేసేది ఆటవిక న్యాయమని విమర్శించారు. కేబినెట్ తో పాటు ప్రభుత్వ సలహాదారులు, ఆర్టీఐ కమిషనర్ల నియామకాల వరకు బడుగు, బలహీన వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అగ్రవర్ణాలకు ఒక న్యాయం, పేదలకు మరొక న్యాయం నడుస్తోందని మండిపడ్డారు.

మంత్రి పొంగులేటి తక్షణమే రాజీనామా చేయాలి: హరీశ్ రావు

రాత్రికి రాత్రే అనేక కాలనీలను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారని మండిపాటు

పెద్ద తప్పు చేసి క్షమాపణల చెబితే ప్రజల బాధలు తీరవని వ్యాఖ్య

కల్యాణలక్ష్మి పథకాన్ని సంతానలక్ష్మి పథకంగా మార్చేశారని మండిపాటు



సమస్యలను పరిష్కరించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త చిక్కులు సృష్టిస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరి పిచ్చోడి చేతిలో రాయిలా తయారైందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాత్రికి రాత్రే అనేక కాలనీలను 22ఏ నిషేధిత భూముల జాబితాలో చేర్చడం వల్ల సామాన్య ప్రజలు నరకం చూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 22ఏ నిషేధిత భూముల జాబితాను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 22ఏ నిషేధిత భూముల వ్యవహారంలో జరిగిన పెద్ద తప్పిదానికి నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మంత్రిని పదవి నుంచి తొలగించకపోతే... ముఖ్యమంత్రి, మంత్రులు కలిసే ఈ భూదందా చేశారనే అనుమానాలు ప్రజల్లో మరింత బలపడతాయని వ్యాఖ్యానించారు. పెద్ద తప్పు చేసి ఇప్పుడు క్షమాపణలు చెబితే ప్రజల బాధలు తీరవని, అసలు ఈ భూములను నిషేధిత జాబితాలో చేర్చమని ఆదేశించింది ఎవరో సమాధానం చెప్పాలని నిలదీశారు. ప్రభుత్వం చేసిన తప్పులను అధికారుల మీదికి నెట్టి తప్పించుకోవాలని చూడటం సరికాదని, వారు ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ కూడా పనిచేయడం లేదని విమర్శించారు. భూములను నిషేధిత జాబితాలో పెట్టింది ప్రభుత్వమే కాబట్టి, ప్రజల నుంచి మళ్లీ దరఖాస్తులు తీసుకోకుండా వెంటనే ఆ జాబితా నుంచి తొలగించాలని హరీశ్ రావు స్పష్టం చేశారు. 2008లోనే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం యూఎల్సీని రద్దు చేయడంతో ఆ స్థలాలు పట్టా భూములుగా మారాయని... అలాగే జీఓల ద్వారా మినహాయింపు పొందిన హెచ్ఎండీఏ, హుడా భూములను కూడా ఇప్పుడు 22ఏ లో చేర్చి రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల ప్రజలను వేధిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో కల్యాణలక్ష్మి పథకం 'సంతానలక్ష్మి'గా మారిపోయిందని, పెళ్లి సమయానికి అందాల్సిన సాయం పిల్లలు పుట్టిన తర్వాత గానీ రావడం లేదని ఎద్దేవా చేశారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తప్పు చేసిన కాంగ్రెస్ నేతలను చట్టపరంగా బాధ్యులను చేస్తామని హెచ్చరిస్తూ, 22ఏ భూముల అంశంపై కేసీఆర్ నాయకత్వంలో అసెంబ్లీ వేదికగా పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు.

ఐకమత్యానికి ప్రతీకగా కొమ్ము అనుబంధ కుటుంబాల సంక్షేమ పరపతి సంఘం తొలి ఆత్మీయ సమ్మేళనం

సేవా స్ఫూర్తి.. స్నేహబంధం.. ఐకమత్యమే లక్ష్యంగా నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

మామిడి తోటలో ఆత్మీయంగా సాగిన కుటుంబాల సమ్మేళనం: జలగం వీరస్వామి

నిజం న్యూస్ కేసముద్రం, ఆగస్టు 18: కొమ్ము, అనుబంధ కుటుంబాల మధ్య స్నేహం, ఆత్మీయత, ఐకమత్యాన్ని మరింత బలోపేతం చేస్తూ, సమాజానికి ఆదర్శంగా నిలిచే లక్ష్యంతో కొమ్ము మరియు అనుబంధ కుటుంబాల సంక్షేమ పరపతి సంఘం తొలి ఆత్మీయ సమ్మేళనం మామిడి తోటలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొమ్ము మరియు అనుబంధ కుటుంబాల పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో హాజరై సమ్మేళనాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా కుటుంబాల మధ్య పరస్పర సహకారం, ఆప్యాయత, సేవాభావం, విద్య, ఉపాధి, సామాజిక అభివృద్ధి వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. కుటుంబాల్లో ఎవరికి ఏ సమస్య వచ్చినా అందరూ ఒక కుటుంబంలా అండగా నిలవాలని, వ్యక్తిగత ప్రయోజనాలకు అతీతంగా సమాజ సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగాలని పలువురు సూచించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ విద్యావేత్త, మహబూబాబాద్ జిల్లా మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జలగం వీరస్వామి హాజరై సుదీర్ఘమైన, సందేశాత్మక ఉపన్యాసాన్ని అందించారు. ఈ సందర్భంగా జలగం వీరస్వామి మాట్లాడుతూ, ఒక కుటుంబం బలంగా ఉంటే ఆ కుటుంబం అభివృద్ధి చెందుతుందని, అనేక కుటుంబాలు ఐక్యంగా ముందుకు సాగితే బలమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. మన మధ్య ఉన్న చిన్నచిన్న భేదాలను పక్కనపెట్టి "సేవ, స్నేహం, ఐకమత్యం" అనే మూడు సూత్రాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమాజంలోని పేద, బలహీన కుటుంబాలకు అండగా నిలవడం, విద్యార్థులను ప్రోత్సహించడం, యువతకు మార్గనిర్దేశం చేయడం, మహిళలకు గౌరవం సముచిత స్థానం కల్పించడం, అవసరమైన వారికి ఆపదలో సహాయం చేయడం వంటి కార్యక్రమాలను సంఘం చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు. సంఘం కేవలం ఒక సంస్థగా కాకుండా ప్రతి కుటుంబానికి ఆత్మీయ బంధువుగా, ప్రతి సమస్యకు అండగా నిలిచే సేవా వేదికగా ఎదగాలని సూచించారు.

ఐకమత్యానికి వేదికగా సమ్మేళనం

ఈ ఆత్మీయ సమ్మేళనానికి మాజీ ఎంపీటీసీ కొమ్ము స్వాతి రాహుల్, మాజీ ఎంపీటీసీ కొమ్ము రాహుల్, కొమ్ము వెంకన్న, కొమ్ము యాకయ్య, కొమ్ము ఊశయ్య సంజీవ, కొమ్ము నరసయ్య సంజీవ తదితరులు హాజరయ్యారు. వీరితో పాటు కొమ్ము మరియు అనుబంధ కుటుంబాల పెద్దలు, మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ కొమ్ము స్వాతి రాహుల్ మాట్లాడుతూ, కొమ్ము అనుబంధ కుటుంబాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఐకమత్యాన్ని మరింత బలోపేతం చేసేలా ఇలాంటి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం అభినందనీయమన్నారు. కుటుంబాల మధ్య స్నేహం, ఆత్మీయత, పరస్పర సహకారం పెంపొందించడంతో పాటు సమాజంలోని అవసరమైన వారికి అండగా నిలిచే విధంగా సంఘం ముందుకు సాగాలని ఆకాంక్షించారు. నూతన కమిటీ సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి కుటుంబానికి అందుబాటులో ఉండాలని సూచించారు. సంఘం భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెంది ఐకమత్యానికి, సేవా స్ఫూర్తికి ఆదర్శంగా నిలవాలని రాహుల్ ఆకాంక్షించారు.

సమ్మేళనంలో కొమ్ము మరియు అనుబంధ కుటుంబాల సంక్షేమ సంఘానికి నూతన కమిటీని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రసిడెంట్ గా కొమ్ము శ్రవణ్ కుమార్
వర్కింగ్ ప్రెసిడెంట్ గా పెండెల లక్ష్మణ్
ప్రధాన కార్యదర్శి గా పందుల సారయ్య
ప్రచార కార్యదర్శి గా పెండెల రవికుమార్
కోశాధికారులు గా కొమ్ము ముత్తయ్య సంజీవ, పందుల వేణు మాధవ్ ఎన్నిక కాగా..

కార్యవర్గ సభ్యులుగా..

కడారి నాగయ్య, ఒడ్డూరి వెంకన్న, పందుల శ్రీను, కొమ్ము సునీల్, కొమ్ము రామకృష్ణ, కొమ్ము నిఖిల్, మామిళ్ల ప్రేమ్ కుమార్, కొమ్ము అబ్రహం రవి, పట్ల నవీన్, గుడెల్లి దిలీప్, కొమ్ము నరేష్, కొమ్ము మురళి ఎన్నికయ్యారు.

సంఘం నూతన కమిటీకి మార్గనిర్దేశం చేసేందుకు ప్రముఖ విద్యావేత్త, విశ్రాంత ఉపాధ్యాయులు కొమ్ము దేవిడ్, కొమ్ము నరసయ్య సంజీవ, కొమ్ము సత్యం, కొమ్ము వీరాస్వామి, కొమ్ము ఎల్లయ్య యాకయ్య, పందుల సంజీవ, తెలుగు పండిట్ జలగం వీరస్వామి, గుండెపాక యాకయ్య, బండ ఆశయ్య, కొమ్ము యాకయ్య వెంకన్న, కొమ్ము ఉషయ్య సంజీవ, ఇమ్మడి వీరభద్రం, దాసరి నాగయ్య, ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు, మెరుగు ఉపేందర్, కొమ్ము క్రిష్టఫర్ తదితరులను ముఖ్య సలహాదారులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ, తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రతి కుటుంబానికి అందుబాటులో ఉంటామని తెలిపారు. సంఘం ద్వారా విద్య, వైద్యం, ఉపాధి, ఆర్థిక సహకారం, యువత అభివృద్ధి, మహిళా సాధికారత, సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. అందరి అండతో సంఘాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తాం: అధ్యక్షుడు శ్రవణ్ కుమార్ నూతనంగా ఎన్నికైన కమిటీ అధ్యక్షుడు కొమ్ము శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ, తమపై ఉంచిన బాధ్యతను గౌరవంగా స్వీకరిస్తున్నామని తెలిపారు. సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ ప్రతి కుటుంబానికి చేరువగా ఉండేలా పనిచేస్తామని అన్నారు. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు, యువతకు మార్గనిర్దేశం, మహిళల సాధికారతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. అవసరమైన ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని హామీ ఇచ్చారు. "మనమంతా ఒక్కటిగా ఉంటే ఏ సమస్యనైనా పరిష్కరించుకోవచ్చు.. మన ఐకమత్యమే మన బలం.. మన సేవే మన గుర్తింపు" అనే స్ఫూర్తితో సంఘాన్ని ముందుకు తీసుకెళ్లాలని సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. కొమ్ము, అనుబంధ కుటుంబాల సంక్షేమ సంఘం తొలి ఆత్మీయ సమ్మేళనం కుటుంబాల మధ్య స్నేహబంధాలను మరింత బలోపేతం చేస్తూ, భవిష్యత్ తరాలకు ఐకమత్యం, మానవత్వం, సేవా స్ఫూర్తికి ఆదర్శంగా నిలిచేలా ఘనంగా ముగిసిన కార్యక్రమానికి ప్రధాన కార్యదర్శి పందుల సారయ్య వందన సమర్పణ గావించారు.

ప్రజల మద్దతుతో అధికారాన్ని నిర్మించిన సర్వాయి పాపన్న పోరాటం విప్లవాత్మకం: డా.సత్యం శ్రీరంగం



నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 18: " ప్రజల శ్రమతో నిర్మితమైన రాజ్యంలో ప్రజలకే అధికారం ఉండాలనే పాపన్న సందేశం నేటికీ సజీవంగానే ఉంది. గోల్కొండ కోటపై జెండా ఎగురవేసిన తొలి బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకొని గౌడ సంఘం, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు రాజేష్ గౌడ్, గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి రాచమల్ల శేఖర్ గౌడ్ ల ఆహ్వానాల మేరకు కెపిహెచ్బి టెంపుల్ బస్టాండ్ మరియు మూసాపేట్ లో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం. ఈ సందర్భంగా మాట్లాడుతూ అణగారిన వర్గాలు కేవలం పాలనను అనుసరించే ప్రజలు మాత్రమే కాదని అవసరమైతే తమ హక్కుల కోసం పోరాడగలరని, తమ నాయకత్వాన్ని తాము నిర్మించుకోగలరని పాపన్న తన జీవితంతో నిరూపించాడు అని అన్నారు. భూస్వాములు, దేశముఖ్ లు, జాగీర్దార్లు వంటి స్థానిక అధికార కేంద్రాల ఆధిపత్యం సామాన్య ప్రజల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపేది అని ఈ పరిస్థితులను చూసిన పాపన్నలో తిరుగుబాటు భావం బలపడింది, అయితే తన అసంతృప్తిని వ్యక్తిగత పోరాటానికే పరిమితం చేయలేదు వివిధ సామాజిక వర్గాల ప్రజలను సమీకరించి ఒక శక్తివంతమైన ఉద్యమాన్ని నిర్మించాడు. ప్రజల స్వయం పాలనకు ప్రతీకలు భారత చరిత్రలో రాజ్యాధికారం ప్రధానంగా వంశపారం పర్యంగా సంక్రమించిన కాలంలో, ఒక శ్రమజీవి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ప్రజల మద్దతుతో అధికారాన్ని నిర్మించడం విప్లవాత్మక పరిణామం. అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి, సామాజిక న్యాయానికి బాటలు వేసిన పోరాటయోధుడు అని పాపన్న జీవితంలో మనకు కనిపించే గొప్ప గుణం- ఓటమిని అంతి మంగా భావించకపోవడం. ఆయన జయంతి సందర్భంగా వారి పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగుదాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షులు గోపిశెట్టి రాఘవేందర్, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, డివిజన్ అధ్యక్షుడు దెంది అరవింద్ రెడ్డి, శేరి సతీష్ రెడ్డి, కొప్పిశెట్టి దినేష్, ఏఎంసీ డైరెక్టర్లు ఫణి కుమార్, సుధాకర్ రెడ్డి, భిక్షపతి గౌడ్, డివిజన్ మాజీ అధ్యక్షులు సతీష్ గౌడ్, కేబుల్ శ్రీను, రంగ మోహన్, నితీష్ గౌడ్, మణి గౌడ్, స్వరూప గౌడ్, పొన్నం రజిత గౌడ్, బచ్చు మల్లి, ప్రభాకర్, కిరణ్, పాండు ముదిరాజ్, శ్రీధర చారి, కళ్యాణ్ బాబు, దుర్గ ప్రసాద్, పలాస కిషోర్ గౌడ్, సత్యం గౌడ్, వినోద్ గౌడ్, రవీందర్ గౌడ్, విజయ్ కుమార్ గౌడ్, వెంకట్ గౌడ్, సాగర్ గౌడ్, వెంకటేష్ గౌడ్, మోహన్ గౌడ్, గౌడ సంఘ సభ్యులు, నాయకులు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నవంబర్ నెల దర్శన కోటా విడుదల వివరాలు

నిజం న్యూస్ తిరుపతి, ఆగస్టు 18: నవంబర్ నెలకు సంబంధించి టీటీడీ విడుదల చేయు వివిధ దర్శనాల, గదుల కోటా వివరాలు ఈ విధంగా ఉన్నాయి. తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల(సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవ) కు సంబంధించిన కోటాను ఆగస్టు 18న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.ఈ సేవా టికెట్లు ఎలక్ట్రానిక్ డిప్ కోసం 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన వారు 20 నుండి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి టికెట్లు మంజూరవుతాయి. 21న ఆర్జిత సేవా టికెట్ల విడుదల కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను 21న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్ లైన్ లో విడుదల చేయనుంది.

వర్చువల్ సేవల కోటా విడుదల

వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను 21న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

24న అంగ ప్రదక్షిణ టోకెన్లు విడుదల

అంగ ప్రదక్షిణ టోకెన్ల కోటాను 24న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు.

శ్రీవాణి దర్శన కోటా విడుదల

శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను 24న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు.

వృద్ధులు, దివ్యాంగుల దర్శన కోటా...

వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను 24న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

25న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల

ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను 25న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

తిరుమల, తిరుపతిలలో గదుల కోటా విడుదల...

తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను 25న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.

https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని కోరడమైనది.

టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారిచే జారీ చేయబడినది.

తెలంగాణ వీరుడు, బడుగు బలహీన వర్గాల సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలల్లో పాల్గొన్న జనసేన నాయకులు : ప్రేమ కుమార్

నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 18: మంగళవారం కూకట్‌పల్లిలో కూకట్‌పల్లి గ్రామ గౌడ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి చేదురుపల్లి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ వీరుడు, బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ జనసేన పార్టీ జాయినింగ్ కమిటీ సభ్యులు కూకట్‌పల్లి జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ హాజరై, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ వీరోచిత పోరాటాన్ని, సమాజంలోని బడుగు బలహీన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం సమానత్వం కోసం ఆయన చేసిన కృషిని నాయకులు, కుల పెద్దలు స్మరించుకున్నారు. సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా నిలిచి, అణగారిన వర్గాలకు ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని అందించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు. ఆయన చూపిన ధైర్యం, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ ని కూకట్‌పల్లి గ్రామ గౌడ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి చేదురుపల్లి శ్రీనివాస్ గౌడ్ శాలువాతో ఘనంగా సత్కరించి, జయంతి కార్యక్రమానికి హాజరైనందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పోలెబోయిన శ్రీనివాస్, గౌడ సంఘం కుల పెద్దలు గొరిగే యాదయ్య గౌడ్, జొన్నాడ ప్రభాకర్ గౌడ్, గుల్ల సత్యనారాయణ గౌడ్, గురికే బాబు గౌడ్, గుండ్ల నర్సింగ్ గౌడ్ తదితరులు పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి గ్రామ గౌడ సంక్షేమ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రను, ఆయన సామాజిక పోరాట స్ఫూర్తిని ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రతి సంవత్సరం జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.

టాయిలెట్ డస్ట్‌బిన్ కాదు! కేపీహెచ్‌బీలో మురుగునీటి శుభ్రత డ్రైవ్ హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బి హెచ్చరికలు

నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 18: కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్‌లో మురుగునీటి పైపుల్లో పదేపదే అడ్డంకులు ఏర్పడుతున్న నేపథ్యంలో హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బి అధికారులు శుభ్రత డ్రైవ్ నిర్వహించారు. స్థానికుల ఫిర్యాదుల మేరకు చేపట్టిన ఈ చర్యలో, మురుగునీటి పైపుల్లో చెత్త పేరుకుపోవడంతో డ్రైనేజీ సమస్యలు ఎదురవుతున్నట్లు గుర్తించారు. 'సీవరేజ్ కాప్స్' బృందం ఆధ్వర్యంలో, సీవరేజ్ సూపర్‌వైజర్ పర్యవేక్షణలో ఈ శుభ్రత పనులు జరిగాయి. కేపీహెచ్‌బీ కాలనీ, వాసంత్ నగర్ వార్డుల మేనేజర్‌గా ఉన్న మమత, మార్గదర్శకత్వం అందించారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించడంలో 7వ ఫేజ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు కూడా సహకరించారు. పరిశీలనలో డైపర్లు, శానిటరీ ప్యాడ్లు, పాలిథిన్ కవర్లు పైపుల్లో బ్లాక్ అవుతూ మురుగునీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బి కూకట్‌పల్లి జోన్ జనరల్ మేనేజర్ హరిశంకర్, కూకట్‌పల్లి సర్కిల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ త్రినాథరావు నివాసితులకు సూచనలు చేశారు. టాయిలెట్‌లోకి లేదా మురుగునీటి లైన్‌లోకి ఘన వ్యర్థాలను వేయకూడదని వారు స్పష్టం చేశారు. అలా చేస్తే మురుగునీటి పొంగిపొర్లడం, దుర్వాసన, ఆరోగ్య సమస్యలు, నిర్వహణ ఖర్చులు పెరగడం వంటి ఇబ్బందులు వస్తాయని హెచ్చరించారు. డైపర్లు, శానిటరీ ఉత్పత్తులు, ప్లాస్టిక్ వస్తువులు, వైప్స్ వంటి వ్యర్థాలను సరైన చెత్త సేకరణ విధానం ద్వారానే పారవేయాలని హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బి కోరింది. మురుగునీటి లైన్లను శుభ్రంగా ఉంచేందుకు ప్రజల సహకారం అత్యవసరమని అధికారులు తెలిపారు.

శ్రీ శ్రీ శ్రీ బంగారు మైసమ్మ బోనాల ఏర్పాట్లపై సమీక్ష

నిజం న్యూస్ ప్రతినిధి, మేడిపల్లి,ఆగస్టు 18 :ఈ నెల 23న జరగనున్న శ్రీ శ్రీ శ్రీ బంగారు మైసమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ఏర్పాట్లను మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజ, మేడిపల్లి ఇన్స్పెక్టర్ జితేందర్ రెడ్డి,ఆలయ చైర్మన్ బొబ్బల లక్ష్మారెడ్డితో కలిసి పరిశీలించారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్యం, తాగునీరు,విద్యుత్, భద్రత,ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ డివిజన్ అధ్యక్షుడు పోగుల నర్సింహ్మారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్ కుమార్, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్,చెంగిచెర్ల డివిజన్ అధ్యక్షుడు పోగుల దిలీప్ రెడ్డి,మాజీ కార్పొరేటర్లు రసాల వెంకటేష్ యాదవ్,చీరాల నర్సింహ్మా,నాయకులు దానగాళ్ళ యాదగిరి, సబ్ ఇన్స్ పెక్టర్లు నర్సింగ్ రావు,యాకన్న,ఆలయ నిర్వాహకులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బహుజన రాజ్య స్థాపనకు సర్వాయి పాపన్న పోరాటం స్ఫూర్తిదాయకం: బండి రమేష్



నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 18: బహుజనుల బాగుకోసం కత్తిపట్టిన పోరాడిన వీరుడు సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలు జనతానగర్ ,మూసాపేటలో శేఖర్ గౌడ్, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.ఈ వేడుకల్లో టిపీసీసీ ఉపాధ్యక్షులు,కూకట్పల్లి పార్టీ ఇంచార్జ్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ పాల్గొని పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ బహుజన రాజ్య స్థాపనకు సర్వాయిపాపన్న పోరాటం చేసి చరిత్రలో చిరస్మరణీయుడు అయ్యారని .. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బహుజనులకు సముచిత స్తానం కల్పించి గౌరవించుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, సీనియర్ నాయకులు కార్క్ పెంటయ్య, డివిజన్ ప్రెసిడెంట్ తూము సంతోష్ , డివిజన్ ప్రెసిడెంట్ కలికోట శంకర్, సీనియర్ నాయకులు సునీల్, నాగరాజు, యూత్ కాంగ్రెస్ సలీం, సీనియర్ నాయకులు చున్నుపాషా, కేబుల్ శ్రీను, మధు, సప్పిడి భాస్కర్, సచిన్, లక్ష్మీనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

నిజం దృష్టి తెలుగు న్యూస్ TG/TEL05/A3731

బుధవారం 19-08-2026

గౌడల ఆత్మగౌరవానికి ప్రతీక సర్వాయి పాపన్న గౌడ్

బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, బిసి నేత ఎడ్ల బాలవర్ధన్ గౌడ్

పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని కితాబు

గౌడ సంఘాల ఆధ్వర్యంలో భారీ ఎత్తున నివాళులు

నిజం న్యూస్ జడ్చర్ల , ఆగస్టు 18: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తెలంగాణ నేలపై సామాన్య ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడిన గొప్ప వీరుడని మహబూబ్‌నగర్ జిల్లా బిజెపి పార్టీ అధికార ప్రతినిధి, జడ్చర్ల బీసీ సంఘం ముద్దుబిడ్డ ఎడ్ల బాలవర్ధన్ గౌడ్ కొనియాడారు. మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకుని జడ్చర్ల పట్టణంలో గౌడ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, గౌడ సంఘాల ప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తెలంగాణ నేలపై సామాన్య ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడిన గొప్ప వీరుడని కొనియాడారు. సామాన్య కుటుంబం నుంచి ఎదిగి తన ధైర్యసాహసాలతో గోల్కొండ ఖిలాను పాలించే స్థాయికి చేరుకున్న పాపన్న గౌడ్ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. పాపన్న గౌడ్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పాపన్న గౌడ్ కేవలం ఒక వర్గానికే పరిమితమైన నాయకుడు కాదని, సామాజిక సమానత్వం, ప్రజల ఆత్మగౌరవం కోసం పోరాడిన ప్రజా వీరుడని అన్నారు. అణగారిన వర్గాలపై జరుగుతున్న అన్యాయాలను ఎదిరిస్తూ తన పరాక్రమంతో పోరాటం చేసిన పాపన్న గౌడ్ ధైర్యం, తెగువ, నాయకత్వ లక్షణాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ఆయన చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

దృశ్య బంధనం

నిజం న్యూస్ హైదరాబాద్ ప్రతినిధి, ఆగస్టు 18

కాలాన్ని నిలిపే అద్భుతం
రెప్పపాటులో క్షణాన్ని,శాశ్వతంగా బంధించే మాయాజాలం
కంటికి కనిపించే రూపాల వెనుక
కనిపించని జ్ఞాపకాలనిధి
భాషతో పనిలేని భావచిత్రం
మాటలు రాని మౌన గీతం
ప్రతి క్షణాన్ని కావ్యంగా మలిచే సృజనశీలి ప్రతిచిత్రం
అక్షర రహిత దృశ్య కావ్యం ప్రతిచిత్రం... ఎంత విచిత్రం
నవ్వులు... కన్నీళ్లు..
ఆనందాల విహారాలు
బోసి నవ్వులు
ముదిమి ముసుర్లు
ప్రకృతి పరువాల ప్రళయాలూ...ఒకటేమిటి
చిత్రజాలం లో బందింపబడిన దృశ్య బంధన చిత్రాలెన్నో.. ఎన్నెన్నో..
ఒక్క క్లిక్‌తో ప్రపంచాన్ని చుట్టేసి
మనసు మూలల్లోని భావాలను తట్టి లేపి
నిన్నటి నిజాలను నేటికీ సజీవంగా ఉంచే
ఛాయాచిత్ర కళకు వందనం!
(ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు!)
కొండూరి. కోటీబాబు
హైకోర్టు అడ్వకేట్, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ, హైదరాబాద్.

ఇందిరమ్మ ఇళ్లకు రూ.230కే సిమెంట్ బస్తా:మంత్రి పొంగులేటి

నిజం న్యూస్ హైదరాబాద్ ఆగస్టు 18: ప్రజాప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో సిమెంట్ పరిశ్రమలు భాగస్వాములు కావాలని రాష్ట్ర హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంట్ ధరల తగ్గింపుపై ఆయా పరిశ్రమల యాజమాన్యాలతో సమావేశమయ్యారు. మంత్రి విజ్ఞప్తి మేరకు ఒక్కో బస్తాను రూ.230కు ఇవ్వడానికి యాజమాన్యాలు అంగీకరించాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కేవలం గృహ నిర్మాణ కార్యక్రమం మాత్రమే కాదని.. పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితం, సామాజిక భద్రత, ఆత్మగౌరవాన్ని కల్పించే మహాయజ్ఞమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. వీటిలో ఇప్పటికే గణనీయ సంఖ్యలో 85 శాతం ఇళ్ల శ్లాబులు పూర్తయ్యాయని.. మిగిలిన 15 శాతం ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. రెండో విడతలో నియోజకవర్గానికి రెండు వేల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా రెండున్నర లక్షల ఇళ్లు మంజూరు చేశామన్నారు. అలాగే క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొని ప్రయోగాత్మకంగా 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్లకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. నిర్మాణ పురోగతికి అనుగుణంగా విడతల వారీగా ప్రతి సోమవారం పారదర్శకంగా నిధులను విడుదల చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలిపారు.

మునిపంపుల దళిత కాలనీలో రాచకాల్వ సమస్యను పరిష్కరించాలి

ఇండ్ల మధ్య నుంచి మురికి నీరు ప్రవహిస్తుండటంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు విషసర్పాల సంచారం

ఇరిగేషన్ అధికారులు చొరవ చూపాలి

సిపిఎం మండల కార్యదర్శి, గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం

నిజం న్యూస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా ఆగస్టు 18: మునిపంపుల గ్రామంలోని దళిత కాలనీలో ఇండ్ల మధ్య నుంచి ప్రవహిస్తున్న రాచకాల్వ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో కాలనీని పరిశీలించడం జరిగింది.కాల్వలో మురికి నీరు నిలిచి దుర్గంధం వెదజల్లడంతో పాటు, విషసర్పాలు, ఇతర సరీసృపాలు ఇండ్లలోకి వస్తున్నాయని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మురికి నీటి కారణంగా కాలనీ ప్రజలు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉందని వారు తెలిపారు.ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి, గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం మాట్లాడుతూ కాలనీ ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకుని ఇరిగేషన్ అధికారులు రాచకాల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం.ఉందన్నారు.కాల్వకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించాలని, మురికి నీరు సక్రమంగా ప్రవహించేలా స్లాబ్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కోరారు.కాల్వ సమస్యను వెంటనే పరిష్కరించి దుర్గంధం, దోమలు, విషసర్పాల బెడద నుంచి కాలనీ ప్రజలను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజారోగ్యానికి ముప్పు కలిగించే ఇటువంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు తొందుపూరి శ్రీనివాస్, శాఖ కార్యదర్శి జితేందర్,వార్డు సభ్యులు గంటెపాక శ్రీను, బూడిద.నర్సింహా,నాయకులు తొలుపునూరి చంద్రశేఖర్,బూడిద భిక్షం, ఉర్సుగాని నర్సింహా, ఎండీ మైనొద్దీన్,జోగుల శ్రీనివాస్, గునుగుంట్ల సత్యనారాయణ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

అల్లాపూర్ డివిజన్లో మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 18: మంగళవారం కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అల్లాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సబియా గౌసుద్దీన్ , సప్దర్ నగర్ ఈ బ్లాక్ లో పర్యటించారు ..ప్రధానంగా ఈ ప్రాంతంలో రోడ్డు,మంచి నీటి సమస్యకు సంబంధించి అధికారులు ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సత్వరమే చర్యలు తీసుకునే విధంగా ప్రణాళికలు రచించాలని దానికి సంబంధించి నిధులకు ఇబ్బందులేకుండా చూస్తానని హామీ ఇచ్చారు.. అలాగే కామని చెరువు అభివృద్ధి పనులు పరిశీలించి హెచ్ఎండిఏ అధికారులకు పలు సూచనలు చేశారు.. సున్నం చెరువు నుంచి మైసమ్మ చెరువు వరకు నాలా రిటర్నింగ్ వాల్ పనులు చేపట్టాలని సూచించారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు అందించడంలో ఎటువంటి రాజీ లేకుండా గత పది ఏళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్, ఆనాటి మంత్రి కేటీఆర్ సహకారంతో అల్లాపూర్ డివిజన్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ వచ్చామని.. ఇంకా పెండింగ్లో ఉన్న పనులకు నిధులు మంజూరైన కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అవి పెండింగ్లో పడటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని.. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను అందించాలని కోరారు.. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహ్మద్ గౌసిద్దీన్, డివిజన్ అధ్యక్షులు లింగాల ఐలయ్య, వీరారెడ్డి అధికారులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు...మంగళవారం కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అల్లాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సబియా గౌసుద్దీన్ , సప్దర్ నగర్ ఈ బ్లాక్ లో పర్యటించారు ..ప్రధానంగా ఈ ప్రాంతంలో రోడ్డు,మంచి నీటి సమస్యకు సంబంధించి అధికారులు ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సత్వరమే చర్యలు తీసుకునే విధంగా ప్రణాళికలు రచించాలని దానికి సంబంధించి నిధులకు ఇబ్బందులేకుండా చూస్తానని హామీ ఇచ్చారు.. అలాగే కామని చెరువు అభివృద్ధి పనులు పరిశీలించి హెచ్ఎండిఏ అధికారులకు పలు సూచనలు చేశారు.. సున్నం చెరువు నుంచి మైసమ్మ చెరువు వరకు నాలా రిటర్నింగ్ వాల్ పనులు చేపట్టాలని సూచించారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు అందించడంలో ఎటువంటి రాజీ లేకుండా గత పది ఏళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్, ఆనాటి మంత్రి కేటీఆర్ సహకారంతో అల్లాపూర్ డివిజన్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ వచ్చామని.. ఇంకా పెండింగ్లో ఉన్న పనులకు నిధులు మంజూరైన కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అవి పెండింగ్లో పడటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని.. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను అందించాలని కోరారు.. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహ్మద్ గౌసిద్దీన్, డివిజన్ అధ్యక్షులు లింగాల ఐలయ్య, వీరారెడ్డి అధికారులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు...

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ



నిజం న్యూస్ హైదరాబాద్, ఆగస్టు 18: జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వద్ద వన్-వే నిబంధనలు : ప్రయాణికుల సౌకర్యార్థం టీజీఎస్ ఆర్టీసీ (టీఎస్ఆర్టీసీ) ప్రత్యేక బస్సు రూట్ల క్రమబద్ధీకరణ. కేబీఆర్ పార్క్ చుట్టూ మారిన ప్రయాణ మార్గాలు ఒ బస్సు స్టాప్‌ల వివరాలు జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ మరియు కేబీఆర్ పార్క్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా అమలు చేస్తున్న వన్-వే (ఏకదిశ) నిబంధనల దృష్ట్యా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టీజీఎస్ ఆర్టీసీ (టీఎస్ఆర్టీసీ) ప్రత్యేక కార్యాచరణను చేపట్టింది. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రధాన బస్సు రూట్లలో స్వల్ప మార్పులు చేస్తూ, స్టాప్‌ల మరియు స్టేజీల వివరాలను టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం ప్రకటనలో వెల్లడించింది.

మారిన నిబంధనల ప్రకారం క్రింది ప్రధాన రూట్లలో బస్సు సర్వీసుల ప్రయాణ మార్గాలను క్రమబద్ధీకరించడం జరిగింది:

రూట్ నం. 127కా: కొండాపూర్ – కోఠి
రూట్ నం. 222ఎ: పటాన్‌చెరు – కోఠి
రూట్ నం. 47ఎ: మణికొండ – సికింద్రాబాద్ / జేబీఎస్
రూట్ నం. 10హెచ్: కొండాపూర్ – సికింద్రాబాద్

కేబీఆర్ పార్క్ చుట్టూ ప్రయాణించే బస్సులు క్రింది మార్గం ద్వారా అందుబాటులో ఉంటాయి...

ప్రయాణ మార్గం
రూట్ నం. 47ఎ (సికింద్రాబాద్/జేబీఎస్ – మణికొండ)
అప్ జర్నీ (సికింద్రాబాద్ నుండి మణికొండ)
సికింద్రాబాద్ బేగంపేట నాగార్జున సర్కిల్ ఎల్.వి. ప్రసాద్ బసవతారకం హాస్పిటల్ బీఆర్ఎస్ భవన్ ? ఎమ్మెల్యే కాలనీ ? ఒమేగా ? అపోలో ఆస్పత్రి ఫిల్మ్ నగర్ ? దర్గా ? మణికొండ.
డౌన్ జర్నీ (మణికొండ నుండి సికింద్రాబాద్):
మణికొండ ? పంచవటి కాలనీ ? దర్గా ? ఫిల్మ్ నగర్ ? జర్నలిస్ట్ కాలనీ ? జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ ? అన్నపూర్ణ స్టూడియో ? ఎల్.వి. ప్రసాద్ హాస్పిటల్ ? టీవీ9 (మసీద్) ? పంజాగుట్ట పి.ఎస్ ? ఆర్.జె. కాలేజీ ? పోలీస్ లైన్ ? ప్లాజా ? సికింద్రాబాద్.
రూట్ నం. 10హెచ్: సికింద్రాబాద్ – కొండాపూర్
సికింద్రాబాద్ ? బేగంపేట ? మైత్రివనం ? యూసఫ్ గూడ ఎక్స్ రోడ్స్ ? వెంకటగిరి ? నవయుగా ? పెద్దమ్మ గుడి ? మాదాపూర్ పోలీసు స్టేషన్ ? కొండాపూర్.
డౌన్ జర్నీ 10హెచ్: కొండాపూర్ - సికింద్రాబాద్
కొండాపూర్ ? పెద్దమ గుడి ?జూబిలీ చెక్పోస్ట్ ?వెంకటగిరి యూసఫ్ గూడ ?మైత్రివనం ?బేగంపేట
సికింద్రాబాద్.
రూట్ నం. 222ఎ: కోఠి – పటాన్‌చెరు
కోఠి లకిడికపూల్ మసబ్ ట్యాంక్ నాగార్జున సర్కిల్ ఎల్.వి.ప్రసాద్ బసవతారకం హాస్పిటల్
బీఆర్ఎస్ భవన్ ఎమ్మెల్యే కాలనీ ఒమేగా అపోలో ఆస్పత్రి జర్నలిస్ట్ కాలనీ జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ పెద్దమ్మ గుడి మాదాపూర్ పీఎస్ ? పటాన్ చెరు.
డౌన్ జర్నీ రూట్ నం. 222ఎ: పటాన్‌చెరు – కోఠి
పటాన్‌చెరు మాదాపూర్ పీఎస్ పెద్దమ్మ గుడి
జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ ?అన్నపూర్ణ స్టూడియో ?ఎల్ వి.ప్రసాద్ ?నాగార్జున సర్కిల్ ?మాసబ్ ట్యాంక్ ?లకడీకపూల్?కోఠి
రూట్ నం. 127కా: కోఠి – కొండాపూర్
కోఠి లకడీకపూల్ మసబ్ ట్యాంక్ పెన్షన్ హౌస్ ఎమ్మెల్యే కాలనీ అపోలో ఆస్పత్రి రోడ్డు నంబర్ 45 మాదాపూర్ పీఎస్ కొండాపూర్.
డౌన్ జర్నీ రూట్ నం. 127కా: కొండాపూర్ – కోఠి
కొండాపూర్ మాదాపూర్ పీఎస్ ?రోడ్డు నంబర్ 45 జర్నలిస్ట్ కాలనీ జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ అన్నపూర్ణ స్టూడియో ?ఎల్.వి.ప్రసాద్ ?బసవతారకం హాస్పిటల్ ?బీఆర్ఎస్ భవన్ ?ఎమ్మెల్యే కాలనీ?పెన్షన్ హౌస్?మాసబ్ ట్యాంక్ ?కోఠి

ప్రయాణికులకు విజ్ఞప్తి: జూబ్లీహిల్స్, ఫిల్మ్ నగర్, బంజారాహిల్స్, రోడ్ నంబర్ 45, పరిసర ప్రాంతాల వైపు వెళ్లే ప్రయాణికులు ఈ మారిన బస్సు రూట్లను, స్టాప్‌లను గమనించి తమ ప్రయాణాన్ని ప్లాన్ చేసుకోవాల్సిందిగా కోరడమైనది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సు సర్వీసులను నడిపించడానికి కూడా తగిన ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు. పీఆర్ఓ, టీజీఎస్ ఆర్టీసీ.

రోజూ ఉదయం కడుపులో మంటగా ఉంటుందా అయితే ఈ చిట్కాలను పాటించండి



సాధారణంగా చాలా మంది అప్పుడప్పుడు అసిడిటీ సమస్యతో బాధపడుతుంటారు. ఇది వచ్చేందుకు అనేక కారణాలు ఉంటాయి. కారం, మసాలాలు ఉన్న ఆహారాలను అధికంగా తినడం, వేళ తప్పించి భోజనం చేయడం, టీ, కాఫీలను అతిగా తాగడం, భోజనం ఎక్కువగా తీసుకోవడం వంటి అనేక కారణాల వల్ల అసిడిటీ వస్తుంది. దీంతో ఏం చేయాలో తోచదు. మెడికల్ షాపుకు వెళ్లి మందులను కొని తెచ్చి వేసుకుంటారు. అయితే దీర్ఘకాలంలో ఇలా చేయడం మంచిది కాదు. దీంతో పలు సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయి. ఇక కొందరికి రోజంతా అసిడిటీ ఉండదు. కానీ ఉదయం పూట మాత్రం అసిడిటీ ఉంటుంది. అలాంటి వారు కింద చెప్పిన పలు చిట్కాలను పాటించడం వల్ల అసిడిటీ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు. దీంతో ఎంతగానో రిలీఫ్ లభిస్తుంది.

నిమ్మరసం..

అసిడిటీ సమస్యను తగ్గించడంలో నిమ్మరసం ఎంతగానో పనిచేస్తుంది. అయితే నిమ్మరసం కూడా యాసిడ్‌ను కలిగి ఉంటుంది కదా.. అని చాలా మంది అనుకుంటారు. కానీ నిజానికి నిమ్మరసాన్ని మనం తాగితే అది మన శరీరంలో చేరాక ఆమ్లత్వాన్ని కోల్పోతుంది. దీంతో మనకు మేలు జరుగుతుంది. కనుక అసిడిటీ సమస్య ఉన్నవారు నిరభ్యంతరంగా నిమ్మరసం తాగవచ్చు. ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కాస్త నిమ్మరసం కలిపి తాగితే అసిడిటీ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే అజీర్తి కూడా తగ్గుతుంది. ఇక ఉదయాన్నే పరగడుపునే 30 ఎంఎల్ మోతాదులో కలబంద రసాన్ని సేవిస్తున్నా కూడా జీర్ణ సమస్యల నుంచి బయట పడవచ్చు. జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగు పరచడంలో కలబంద ఎంతగానో పనిచేస్తుంది. కలబంద రసాన్ని సేవిస్తుంటే అసిడిటీ నుంచి తక్షణమే ఉపశమనం లభిస్తుంది. దీంతోపాటు గ్యాస్, కడుపు ఉబ్బరం కూడా తగ్గుతాయి.

సోంపు గింజలు..

ఉదయం అసిడిటీ ఎక్కువగా ఉంటే దాన్ని తగ్గించేందుకు సోంపు గింజలు కూడా ఎంతగానో పనిచేస్తాయి. సోంపు గింజలను తీసుకుని నోట్లో వేసుకుని నమిలి తింటుంటే అసిడిటీ తగ్గుతుంది. లేదా సోంపు గింజలను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను తాగుతుండవచ్చు. దీంతో కూడా జీర్ణ సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. ఇక జీర్ణ సమస్యలను తగ్గించడంలో అల్లం కూడా అద్భుతంగానే పనిచేస్తుంది. రోజుకు రెండు సార్లు భోజనానికి ముందు అల్లం రసాన్ని ఒక టీస్పూన్ మోతాదులో సేవించాలి. అల్లం రసం కడుపులో మంటను తగ్గిస్తుంది. పొట్టను ప్రశాంతంగా ఉండేలా చూస్తుంది. పొట్టలో ఉండే అసౌకర్యాన్ని కూడా తగ్గిస్తుంది.

చల్లని పాలు..

వేడి పాలను తాగితే పొట్టలో ఆమ్లత్వం పెరుగుతుంది. కానీ చల్లని పాలను తాగితే పొట్టలో ఆమ్లత్వం తగ్గుతుంది. దీంతో అసిడిటీ నుంచి బయట పడవచ్చు. కనుక కడుపులో మంటగా ఉన్నప్పుడు వేడి పాలను కాకుండా చల్లని పాలను తాగితే మేలు జరుగుతుంది. కడుపులో రోజంతా మంటగా ఉండేవారు కొబ్బరినీళ్లను తాగుతుండాలి. దీంతో చక్కని ఉపశమనం లభిస్తుంది. అలాగే తులసి ఆకులను నేరుగా అలాగే తింటున్నా కూడా కడుపులో మంట నుంచి ఉపశమనం పొందవచ్చు. ఇలా పలు చిట్కాలను పాటించడం వల్ల కడుపులో మంటను తగ్గించుకోవచ్చు. జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది.

తెలంగాణ ఓటర్ల జాబితా:పేరు లేకుంటే ఏం చేయాలంటే..?

తెలంగాణలో ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

నిజం న్యూస్ హైదరాబాద్, ఆగస్టు 18: జాబితాలో పేరు లేనివారు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి వివరాల్లో తప్పులుంటే ఫారం-8 ద్వారా సరిచేసుకునే అవకాశం అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా ప్రచురణ తెలంగాణలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్) 2026కు సంబంధించిన ముసాయిదా జాబితాను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సోమవారం విడుదల చేశారు. ఓటర్ల జాబితాలో పేరు గల్లంతైన వారు ఫారం-6 ద్వారా తిరిగి తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2 కోట్ల ఎన్యూమరేషన్ ఫారాలు అందాయని, ఇది మొత్తం ఓటర్లలో 78.30 శాతమని అధికారులు వెల్లడించారు. వీటిలో అధిక శాతం ఓటర్లను ఎపిఐడీ (గ్రూపు), చిరునామా మార్పు, మృతి, డూప్లికేట్ కేటగిరీ కింద చేర్చారు. తాత్కాలికంగా చిరునామా మారిన వారు, అందుబాటులో లేని వారు, మరణించిన వారు, వేర్వేరు చోట్ల ఓటు హక్కు ఉన్న వారు కలిపి మొత్తం 73,39,235 మంది ఈ కేటగిరీలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇంటింటి సర్వే చేపట్టిన సమయంలో బూత్ స్థాయి అధికారులు ఈ వివరాలను సేకరించారు.

జాబితాలో పేరు లేకుంటే ఏం చేయాలి?

ముసాయిదా జాబితాలో పేరు లేని వారు లేదా ఏఎస్‌డీ జాబితాలో ఉన్న వారు కొత్తగా ఓటు నమోదు కోసం ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ దరఖాస్తుతో పాటు వయసు, గుర్తింపు ధ్రువీకరణ పత్రాలను జత చేయాలి. దరఖాస్తులో పూర్తి పేరు, పుట్టిన తేదీ, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, కుటుంబ సభ్యులలో ఒకరి వివరాలు, పూర్తి చిరునామా, ఓటర్ ఐడీ నంబర్ (ఉంటే) వంటి సమాచారాన్ని పొందుపరచాలి.

జాబితాలో పేరు ఉండి వివరాలు తప్పుగా ఉంటే..?

ఇప్పటికే జాబితాలో పేరు ఉండి, వివరాల్లో తప్పులు (పేరు, ఫోటో, చిరునామా మార్పు) ఉన్న వారు ఫారం-8 ద్వారా ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ పద్ధతిలో సవరణలు చేసుకోవచ్చు. అభ్యంతరాలు, చేర్పుల స్వీకరణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఓటర్లు తమ వివరాలను సీఈఓ తెలంగాణ లేదా కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్లలో తనిఖీ చేసుకుని, అవసరమైన మార్పులు చేసుకోవాలని అధికారులు సూచించారు.